


# అమ్మస్వామి నాన్నస్వామి వాడుస్వామి నేనుస్వామి కుమారస్వామి

'మెంటా మదు' అని మంచి శెట్టిగార్ల పిల్లోడు.

కొమ్మ పట్టుకొని గట్టిగా ఒక్క ఊపు ఊపితే గలగలమని రాలతాయే నేరేడుపండ్లు... ఆ రంగులో ఉంటాడు నల్లగా.

అయితే ఏమి? ముకాన బలే కళ. తెల్లటి పళ్లు. రింగు రింగుల క్రాపింగు. ఎప్పుడు చూసినా ఆగకుండా వస్తా ఉండే నవ్వు.

వాళ్ల నాయనకి ఐదులాంతర్ల సెంటరుకాడ 'మెంటా వారి కుదవ వ్యాపారము' అనే అంగడి ఉంది. దాంతో పాటు డబ్బులు కూడా దండిగా ఉన్నాయి. అందుకని ఆయన – ఆయనకు పుట్టిన ఒక్కగానొక్క కొడుకైన వీణ్ణి యాపక తినడం మొదలుబెట్టాడు.

'నాయనా మదు నాయనా. బడి నీకు అయిదు గంటలకి అయిపోతుంది. కానీ ఐదు

న్నరకల్లా ఇంటికొచ్చెయ్యమని నేనేమి నిన్ను అడగను. కావాలంటే ఆరుకి రా. ఆరున్నరకి రా. నీ ఇష్టం. నేను మాట్లాడను. రాంగానే గుర్రమ్మ అంగడి కాడికి పోయి వేడి వేడి దోసెలు తింటాననంటావా? తిను. రెండు కాదు నాలుగు తిను. వద్దనను. మిక్చరు పొట్లంలో నిమ్మ కాయ పిండుకొని నమలతాననంటావా? నములు. ఒకటి గాదు. రెండు నములు. కాదన ను. సింగోళ్ల జిలేబీ కావాలా? తెచ్చుకో. అంజీ హోటలు పులిబంగరాలు కావాలా? తెప్పిస్తా. కానీ నాయన్నాయన. నా మాటిను. చదువు మాత్రం అశ్రద్ధ చెయ్యబాకరా. నాకెట్టా రాలా. నీకన్నా వొచ్చేలా చేసుకో బుజ్జమ్మా. ఉండేది ఒకడివి. ఇంకొకడున్నాడులే అని అనుకోడానికి లాకపాయె గదరా. అదీ నా బాద. అర్దం చేసుకో మదమ్మా' అని రోజూ వాణ్ణి సావగొడతా ఉంటే పాపం వాడు ఆ బాద పడలేక మాకాడికొచ్చి ఎక్కిళ్లు పెట్టినంత పని చేసేవాడు.

'ఒరే. మీరు చూస్తానే ఉన్నారు గదరా. కిలాసులో పాటాలు ఎంత ఇంటరెస్టుగా వింటా ఉంటానో. నోట్సు కూడా ఎంత నీటుగా రాసుకుంటా ఉంటానో. అయినాగానీ నాకు చదువు రాకుండా ఉంటే ఏం చేసేదిరా? మా నాయనకు ఏమని చెప్పేదిరా' అని మోకాళ్ల సందన తలకాయ పెట్టుకొని దిగులు పడేవాడు.

అది చూసి నాకు బలే బాదగా అనిపించేది. అదీగాక మనం వాడి కాడ అవసరమైన ప్పుడల్లా పావలా అర్దరూపాయి తీసుకుంటానే ఉన్నాం. మరి అట్టాంటప్పుడు ధైర్యం చెప్పకపోతే ఎట్టా?

'చచ. దీనికే యింత యిదై పోతే ఎట్టరా మదుగా. నేను లేనా? నాకేమైనా చదువొచ్చా? పక్కన కందుల మాలకొండరావుగాడున్నాడు. వాడికేమైనా చదువొచ్చా? కాండూరి మురళీ గాడున్నాడు. వీడికేమైనా చదువొచ్చా? వీళ్లంతా పరీక్షలకు రెండురోజులు ముందర బట్టిగొట్టేసి కొట్టినదాన్ని ముక్కున పట్టేసి పేపర్ల మీద కక్కేసి మార్కులు తెచ్చుకుంటా ఉంటార్రా. అదిరా సీక్రేటు. నువ్వు కిలాసులో ఎంత బాగా యిన్నావు అనేది కాదురా కొసెను. పరీక్షలకు ముందర ఎంత బాగా బట్టీగొట్టావు అనేదిరా పాయింటు. ఇంక మీదట కిలాసుల సంగతి మర్చిపోరా. బట్టీ మీరే దృష్టి పెట్టరా' అన్నాను.

'అంతేనంటావా?' అన్నాడు వాడు.

'అంతేరా'అన్నాను.

ఆరునెలల పరీక్షలు వొచ్చాయి. వాడు నేను చెప్పిన మాడల్‌లో బట్టీ కొట్టి బట్టీ కొట్టి పరీక్షలు రాశాడు. నాకాడికొచ్చి 'అబ్బా నువ్వు చెప్పినట్టుగా బలే రాసినాను మావా' అని అలిసిపోయినట్టుగా వేళ్లు విరుచుకున్నాడు.

మార్కులు వచ్చాయి. చూసుకున్నాడు.

పదహారు, ముప్పయి రెండు, యిరవై నాలుగు, ఆరు, తొమ్మిది...

'మావా.. ఏందిరా ఇది?' అన్నాడు ఒక్కో పేపరుకు ఒక్కో ఐవోరు ఇచ్చిన కోటింగుకి ఎర్రగా అయిపోయిన చేతుల్ని చెడ్డీకి రుద్దుకుంటా.

నాకు మండింది.

'ఎల్లయ్య పొయ్యి పుల్లయ్య కాడ ఏడ్చినట్టుగా ఉందిరా నువ్వు నా కాడ యాడ్వడం. నా పరిస్థితి కూడా అంతేగదరా. మనం ఏం చేస్తాం. ఐవోర్లు గుర్తు పెట్టిచ్చిన పువ్వు గుర్తు

ఇంపార్టెంట్ కొస్సెన్లన్నీ చదివాం. కానీ పేపర్లే టప్పుగా ఇస్తే ఏం చేయగలమురా' అన్నాను.

'ఇప్పుడెట్టరా?' అన్నాడు వాడు.

'ముందర యాపచెట్టు కిందకి పొయ్యి పావలా ఐసులు రెండు తింటేగాని ఒళ్లు చల్లబడదురా. పదరా తిందాం' అని వాణ్ణి తీసుకెళ్లి, వాడి డబ్బులతో ఐసులు తిని, 'ఇంకీ పద్ధతి వేస్టురా. ఓల్డ్ కొసెన్ పేపర్లని బట్టీ గొట్టడం బెస్టురా' అన్నాను.

'అంటే?' అన్నాడు వాడు.

'ఏం లేదురా. లాస్టు ఇయరు, అంతకు ముందు ఇయరు వచ్చిన కొసెను పేపర్లు ఐవోర్ల కాడ వుంటాయి. వాటిని సంపాదించి అందులోని కొస్సెన్లన్నీ బట్టీ గొట్టాలిరా. కొత్త కొసెను పేపర్లు తయారు చేసే ఐవోర్లు పాత కొసెను పేపర్లని ముందుపెట్టుకొని వాటినే రొంత అట్టా ఇట్టా మార్చి ఇస్తా ఉంటారంటరా. అందువల్ల ఓల్డ్ కొసెను పేపర్లు బట్టీ కొడితే సగం మార్కులు గ్యారంటీరా' అన్నాను.

వాడి మొకంలో కళ వచ్చేసింది.

'అబ్బా. అయితే అదే చేద్దామురా' అన్నాడు.

ఇద్దరం కలిసి ఓల్డ్ కొసెను పేపర్లు సంపాదించి వాటిలోని కొస్సెన్లన్నీ టిక్కుపెట్టుకొని ప్రీ పబ్లిక్ పరీక్షల కోసం చదువుకుంటా ఉంటే సరిగ్గా ఆ టైములోనే కటినాత్ముడైన కుమారస్వామి ఐవోరు పెద్ద బాంబేసినాడు.

'అతి ముఖ్య గమనిక. అన్ని సెక్షనుల తొమ్మిదో తరగతి పిలకాయల ఆరునెలల పరీక్షల పలితాలు గమనించిన పిమ్మట వారి శ్రేయస్సు కొరకు మరియు ఇశ్కోదయ శ్రేయస్సు కొరకు వారిని నాలుగు గ్రూపులుగా విబజించడం జరిగినది. ఇక మీదట ఈ గ్రూపుల అనుసారమే వీరికి తర్ఫీదు ఇచ్చుట జరుగును. గాన గమనించగలరు.

ఒకటవ గ్రూపు: ఇది ఎక్సెలెంటు గ్రూపు. అనగా నూటికి డెబ్బయి అయిదుకు పైన వచ్చిన యిద్యార్థులంతా ఈ గ్రూపులో ఉందురు. రేపు టెన్త్ కిలాసులో ఇస్కూలికి ర్యాంకులు తేబోయేది, మంచిపేరు నిలబెట్టేది యీళ్లే గనుక ఈళ్లను ప్రత్యేక శ్రద్ధతో చూసెదము. వీరే మన బవిత.

రెండవ గ్రూపు: ఇది గుడ్డు గ్రూపు. నూటికి అరవై మార్కులు వచ్చిన వాళ్లంతా ఈ గ్రూపులో ఉందురు. వీరిని సాదినచో వచ్చే సంవచ్చరానికి ఎక్సెలెంట్ గ్రూపు అవుదురు. సాదెదము.

మూడవగ్రూపు: యావరేజీ గ్రూపు. నూటికి నలభై అయిదు మార్కులు వచ్చిన వారి గ్రూపు ఇదియే. వీరి యందు మాకు చివరి ఆశలు గలవు. ప్రయత్నము చేసి వీరిని గుడ్ గ్రూపు స్థాయికి చేర్చెదము.

ఇంక నాల్గవది, చివరిది అయిన వరస్టుగ్రూపు: నూటికి ముప్ఫయి అయిదు మార్కుల కంటే తక్కువ వొచ్చిన వాళ్ల గతి వరెస్టు గతియే. వీరి యందు మాకు ఏ కోశానా ఆశ లేదు. వీరికి టీసి ఇచ్చి పంపించుటయా, లేక మరొక అవకాశము ఇచ్చి ఉంచుటయా అనే ఆలోచించుచున్నాము. రేపు ప్రీ పబ్లిక్ పరీక్షలలో వీరంతట వీరు కనీసం యావరేజీ అనిపించుకున్నచో వీరి చేత ఫైనలు పరీక్షలు రాయించెదము. లేని పక్షాన పదో తరగతికి పంపించకుండా తొమ్మిదియే మరొక్కమారు చదివించెదము...' ఇదీ మొత్తంగా పాటం.

ఎప్పుడైతే ఆ నోటీసు వచ్చిందో పిలకాయలందరికీ ఒంటేలు పడిపోయాయి. అందరూ పొయ్యి నోటీసు బోర్డులో గ్రూపుల వారిగా వేసున్న లిస్టుల్లో పేర్లు చూసుకున్నారు.

కేతిరెడ్డి శ్రీదరురెడ్డిగాడు గుడ్ గ్రూపులో ఉన్నాడు. కందుల మాలకొండరావుగాడు, కాండూరి మురళీగాడు యావరేజీలో ఉన్నారు. నేను కూడా యావరేజీయేగానీ ఒక్క లెక్కల్లో మాత్రం వరస్ట్ గ్రూపులో ఉన్నాను. ఇంక మెంటా మదుగాడైతే వరస్టులో ది వరస్టుగా ఉన్నాడు.

అది చూసి వాడు 'మావా. సులబంగా చచ్చిపోయే మార్గం ఏదైనా ఉంటే చెప్పు మామా' అన్నాడు నాతో దిగులుగా.

పాపం వాడి మొకాన ఈ మద్య నవ్వు పోయింది. మనిషి కూడా తగ్గాడు.

'నీకు తెలిస్తే నువ్వే నాకు చెప్పు మావా. ఇన్నాళ్లూ కలిసి బతికాం. పొయ్యేటప్పుడు కలిసే పోదాం' అన్నాను నేను.

'అదేందిరా' అన్నాడు వాడు.

'లాకపోతే ఏందిరా? మనిషనేవాడు అసలు మనిషిగా పుట్టనే కూడదు. పుట్టాక చావనే కూడదు. ఇదిరా మా నాయనమ్మ చెప్పేది. మనం ఇయ్యాల్టి నుంచి ఇంకా ఇంకా చదువుదాం. మన హార్డువర్కుతో మంచి మార్కులు తెచ్చుకొని ప్రీ పబ్లిక్‌లో యావరేజీ వాళ్లని ఒక్క తన్ను తన్ని, గుడ్ వాళ్లని దాటి, ఎక్సలెంటు గ్రూపు వాళ్లకాడికి పొయ్యి రొంత జరుగుబే అని దర్జాగా కూచుందాం. మనం మంచోళ్లం. నోట్లో నాలిక లేని అమాయకులం. దేవుడు మన పక్కే ఉంటాడుగానీ ఎక్సెలెంటువాళ్ల పక్కన క్లవర్ల పక్కన ఉండడు రా' అన్నాను.

'మన పక్కన ఉండేది ఏ దేవుడురా?' అన్నాడు వాడు.

'మా దేవుడు అల్లారా. మీ దేవుడు నీకెవరు ఇష్టమైతే వాళ్లురా' అన్నాను.

'అయ్యప్ప స్వామిరా' అన్నాడు వాడు.

'ఇంకేమీ. ఆయన్నే నమ్ముకోరా' అన్నాను.

ప్రీ పబ్లిక్ పరీక్షలు జరిగేది జనవరిలో. అయ్యప్ప స్వాములు జ్యోతికి పొయ్యేది కూడా ఆ నెలలోనే. ఏమనుకున్నాడో ఏమో మెంటా మదుగాడు మారుమాట్లాడకుండా ఏకంగా అయ్యప్పస్వామి మాలే వేసేసినాడు.

ఇప్పుడు వాడి అవతారమే మారిపోయింది. నల్ల చొక్కా, నల్ల చెడ్డీ, పొద్దున్నే తల స్నానం చేయడం వల్ల ఎండిన రింగుల తల, నుదుట విబూది....

అయ్యప్పస్వామి మాలేసినవాళ్లు మాటకు ముందొక 'స్వామి' మాటకు చివరన ఒక 'స్వామి' పెట్టి మాట్లాడాలంట గదా. అందువల్ల వాడి మాట కూడా మారిపోయింది. ఆఖరుకు వాడు అమ్మకి, నాన్నకి కూడా 'స్వామి' తగిలించడం మొదలుబెట్టాడు.

'మా అమ్మస్వామి ఇయ్యాల ఊరికెళ్లింది స్వామి'

'మా నాన్నస్వామి నాతో పాటు మాలేసినాడు స్వామి'

'మురళీ స్వామి. కూచో స్వామి'

'మాలకొండరావు స్వామి. నిలబడు స్వామి'... ఇట్లా ఉండేయి వాడి మాటలు.

మేము కూడా వాణ్ణి మాలేసినందుకు ఒరే అనకూడదు కాబట్టి-

'మదుస్వామి రా స్వామీ...

'మదుస్వామి పో స్వామీ' అనడం మొదలుబెట్టాం.

ఆఖరుకి ఈ స్వాముల గొడవ ఎక్కడి దాకా పొయ్యిందంటే, ఆల్రెడీ 'కుమారస్వామి' ఐవోరికి ఒక స్వామి ఉంది. వీడి పుణ్యమా అని 'కుమారస్వామి స్వామి' అని డబలుస్వామి అయిపోయాడాయన. అలవాటులో పొరపాటుగా మేము 'కుమారస్వామి స్వామి- కుమారస్వామి స్వామి' అంటా ఉంటే 'ఇదేం బాదరా స్వామి' అని ఆయన తలకాయ పట్టుకునేవాడు.

మొత్తం మీద మెంటా మదుగాడు ఆ అయ్యప్పస్వామి దయవల్లో, ఓల్డ్ కొసెనుపేపర్ల దయ వల్లో ప్రీ పబ్లిక్ పరీక్షలలో యావరేజీ మార్కులు సంపాదించుకొని తొమ్మిదిలోనే ఆగిపోకుండా పదిలోకి వచ్చెయ్యగలిగాడు. ఆ తర్వాత పదో కిలాసులో కూడా మొత్తం మీద ఇట్టాగే ఏదో కసరత్తు చేసి బయటపడ్డాడు. పది తర్వాత ఏమయ్యాడో ఎటు పొయ్యాడో తెలియదు.

వాణ్ణి చూసి పదిహేనేళ్లవతా ఉంది.ఈ కత చూసి ఉత్తరం రాస్తే బాగుండు.

'మదుస్వామీ. రాయి స్వామీ'

■